# జిజెఎం-కెబి వైద్య శిబిరం విజయవంతం



**చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాయత్రినగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, సీనియర్ తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ యువసేన ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన 'ఆరోగ్యరక్ష' మెగా హెల్త్ క్యాంపు విజయవంతం అయ్యింది. ఈ ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 1,700 మంది ప్రజలు హాజరై వైద్యుల వద్ద పరీక్షలు నిర్వహించుకుని అవసరమైన చికిత్స పొందారు. ఈ ఆరోగ్య శిబిరంను తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ సిఎంటి త్యాగరాజులు, బలిజ సంఘ నాయకులు ఓఎం రామదాసు, తెలుగుదేశం నాయకులు చంద్రప్రకాష్, వసంత్‌కుమార్, సందీప్, మహాదేవ్, కోలాకిరణ్ తదితరులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, ఆంకాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, డెంటల్, ఆప్తాల్మాలజీ తదితర విభాగాల్లో రోగులకు వైద్య సేవలను అందుబాటులో వుంచారు. అలాగే బిపీ, జిఆర్‌బిఎస్, ఇసిజి, 2డిఎకో వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిర నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంచడం, అవసరమైన వైద్య సలహాలు ఇవ్వడం కోసం ఈ వైద్య శిబిరంను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల సీనియర్ తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు కాజూరు రాజేష్, కాజూరు జస్వంత్, వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందంకు జికెఎం-కెబి యువసేన కార్యకర్తలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

**చిత్తూరుహెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**




చిత్తూరు జిల్లా పోలీసు సాయుధదళ కార్యాలయంలో ఆదివారం ఏఆర్ డిఎస్పీ మహబూబ్ భాషా ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయుధ డిఎస్పీ మహబూబ్ భాషా మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ప్రకాశం జిల్లా కనుపర్తి గ్రామంలో జన్మించారని, దేశ స్వాతంత్ర్య సమయంలో ప్రకాశం పంతులు ఆపారమైన ధైర్యసాహ సాలను ప్రదర్శించారన్నారు. ప్రకాశం పంతులు కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, న్యాయం, నిజాయితీ, సమానత్వం కోసం నిలబడిన మహానాయకుడన్నాడు. ప్రకాశం పంతులు ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన అనంతరం మొదటి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఆర్ఐలు చంద్రశేఖర్, సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపం పునఃప్రారంభం

**చిత్తూరుహెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
చిత్తూరు కట్టమంచిలో వున్న చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ కార్మగారపు కళ్యాణ మండపం ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో ఈ కళ్యాణ మండపంను సోమవారం పునఃప్రారంభిం చనున్నారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతు నాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంతో పాటు రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ క్లినిక్‌ను నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంకు జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని, అలాగే జిల్లాలోని ప్రజలు ఎవైనా సమస్యలు వుంటే నేరుగా కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై తనకు లేదా అధికారులకు తమ సమస్యను విన్నవంచుకుంటే ఆ సమస్యను సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం అధికారులు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## వైకాపా ఆటలకు ఫుల్‌స్టాప్!

**పెనుమూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
వైకాపా నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వారి ఆటలు ఇక సాగవని జిల్లా తెలుగుదేశం కార్యదర్శి, మాజీ ఎంపిని వీరపల్లి హరిబాబునాయుడు అన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతున్నారని, ప్రతిపక్ష పార్టీగా వైకాపా ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వైకాపా అధినేత ఏ మాత్రం అవగాహన లేకుండా తప్పుడు ప్రకటనలు, ప్రచారాలు చేస్తూ ప్రజలను ఆవహేళన చేస్తున్నారన్నారు. సిఎంగా ఐదేళ్ళపాటు పాలన సాగించిన వైఎస్ జగన్‌కు డిఎస్సీకి ఎపిఎస్‌ఎస్‌సికి తేడా తెలియకపోవడం ఆశ్చర్యకరమన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు రాత్రిపగలు కష్టపడి రాష్ట్రంను ఆర్థికంగా గాడిలో పెట్టి ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం నిర్మాణం, రాజధాన అమరావతి నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేయాలన్న ఉద్దేశంతో కేంద్రం నుండి ఎప్పటికప్పుడు నిధులు తెప్పించి వేగంగా పనులు చేస్తున్నారన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం:ఎమ్మెల్యే

**విజయపురం, ఆగస్టు 23 ప్రభాతవార్త:**




ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని పాత ఆర్కాడు గ్రామానికి చెందిన ఎం.సుశీలకు రూ.29,144లు, సీఎం ఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల సీనియర్‌నాయకుడు, పాత ఆర్కాడు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నాగభూషణం యాదవ్ ఉన్నారు.

## సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి...సంక్షేమం



**కుప్పం, ఆగస్టు23 ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని మండల ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం కొటాలూరు పంచాయతీ గుండ్లమడుగు బూత్ నెం 240,241లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమంను చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో గ్రామాలకు అవసరమైన రోడ్లు, తాగునీటివసతి, వీధిదీపాలు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ అధ్యక్షుడు పొన్నువేలు, మహిళా అధ్యక్షురాలు పుష్ప, నేతలు రామూర్తి, శంకర్, వరదరాజులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

**- కడ పి.డి. వికాస్ మర్మత్**



**కుప్పం, ఆగస్టు23 ప్రభాతవార్త:**
కుప్పం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పంలో నిర్వహి స్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కుప్పం మండల కార్యాలయంలో ఉదయం 10.30గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజలనుంచి నేరుగా వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుప్పం అభివృద్ధికి సిఎం చంద్రబాబు చొరవ

**- పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు**



**రామకుప్పం, ఆగస్టు23 ప్రభాతవార్త:**
కుప్పాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబుపేర్కొన్నారు. ఆదివారం సింగసముద్రం గ్రామంలో ఆయన ఇంటింటికీ తెదేపా కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలపై ప్రజలకు కరపత్రాలను అందించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు కుప్పంలో 32 పరిశ్రమల ద్వారా వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు వచ్చేలా చర్యలు చేపట్టారన్నారు. కృష్ణాజలాలను మరో నెలలో మరలా తీసుకొచ్చి మరిన్ని చెరువులు నింపేందుకు ఆదేశించారన్నారు. త్వరలోనే సిఎం చంద్రబాబు 734కోట్లతో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూమిపూజ చేస్తారన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న సిఎం చంద్రబాబుకు మరింత అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నేత పట్ర నారాయణ, ఎంపిపి సులోచన గుర్రప్ప, నేతలు బాలకృష్ణ, వెంకటాచలం, కృష్ణప్ప, భాస్కర్, బాలాజీ పాల్గొన్నారు.

## నేడు పోలీసు గ్రీవెన్స్

**చిత్తూరుహెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ దూడి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకుంటే వాటిని క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి పోలీసు ఉన్నత అధికారులు చర్యలు తీసుకుంటారని ఎస్పీ తెలిపారు.

# శ్రీప్రియనర్సింగ్‌హోంలో అరుదైన శస్త్రచికిత్స



**- మహిళ కడుపులో ంచి 15కిలోల కణతి తొలగింపు**

**-ఆస్ప త్రి ఛైర్మన్ డాక్టర్ సుధీర్**

**కుప్పం, ఆగస్టు23 ప్రభాతవార్త :**
పట్టణంలోని శ్రీప్రియ నర్సింగ్‌హోంలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ సుధీర్ పేర్కొన్నారు. మహిళ కడుపునుంచి భారీ కణతిని విజయవంతంగా శస్త్రచికిత్స చేపట్టి తొలగించామన్నారు. తమిళనాడు రాష్ట్రంకు చెందిన గోవిందరాజులు భార్య ఈశ్వరి ఏడాది కాలంగా కడుపునొప్పితో బాధపడేదన్నారు. ఈమె పలుచోట్ల చికిత్సలు చేయించిందన్నారు. అయితే శనివారం తీవ్రమైన కడుపునొప్పితో తమ ఆస్పత్రికి వచ్చిందన్నారు. వెంటనే ఆమెకు స్కానింగ్ చేసి పరిశీలించగా కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం ఆపరేషన్ నిర్వహించి ఆమె కడుపుభాగంలో ఉన్న భారీ కణతిని తొలగించామన్నారు. కణతి సుమారు 15 కిలోల బరువు ఉందన్నారు.ప్రస్తుతం ఈశ్వరి ఆరోగ్య ంగానే ఉన్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఛైర్మన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ప్రజలు కడుపునొప్పి, ఇతర నొప్పులంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. వెంటనే వైద్యులను సంప్రదించి తగిన పరిష్కారం ద్వారా వైద్యచికిత్సలు పొందాలని సూచించారు. ఈ అంశాల్లో నిర్లక్ష్యం వహిస్తే అది ప్రాణాలకే ప్రమాదంగా మారే అవకాశం ఉంటుందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## అంబాపురం సమాధులు ఆలయాల్లో చోరీ

**కుప్పం,ఆగస్టు23 ప్రభాతవార్త:**



మండలంలోని కంగుంది పంచాయతీ అంబాపురం, సమాధులు గ్రామాల వద్ద ఉన్న ఆలయాల్లో శనివారం రాత్రి చోరీజరిగినట్లు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబాపురంలోని పురాతన శ్రీ కాళికాంబ అమ్మవారి ఆలయం తాళాలు పగలగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి బంగారుతాళిచైను, వడ్డాణంతో పాటు హుండీ పగలగొట్టి అందులోని నగదును సైతం దొంగిలించుకుపోయారన్నారు. ఈ విషయం ఆదివారం ఉదయం పూజారి ఆలయం వద్దకు వెళ్లగా వెలుగుచూడడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారన్నారు. అలాగే సమాధులు గ్రామంలోని శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో సైతం గుర్తుతెలియనిదొంగలుచోరీకి పాల ్పడ్డారన్నారు. ఈచోరీలపై విచారణ జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.




## వేపూరు గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం

**కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
మండలంలోని మిట్టపల్లి పంచాయతీ వేపూరు గ్రామంలో కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు రాజగోపాల్, నియోజకవర్గ కురబకులసంఘం అధ్యక్షుడు లీలా వెంకటేష్ అధ్వర్యంలో కుప్పం శ్రీ ప్రియ నర్సింగ్‌హోం వారిచే నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా సుమారు మూడు వందల మందికి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా వారికి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అలాగే ముప్పైమందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, పంచాయతీ టిడిపి అధ్యక్షుడు మంజునాథ్, నేతలు రఘుపతి, బాలు, వైద్య బృందం వెంకటేశ్వర్లు, లక్ష్మి,డాక్టర్ సౌరభ్ కులకర్ణి, సుబ్బారెడ్డి, ప్రశాంత్ గౌడ, సూర్య, పిఆర్వో లక్ష్మణ్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కృష్ణాష్టమి వేడుకల పత్రికలు ఆవిష్కరణ

**కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త :**
పట్టణం ప్యాలస్‌రోడ్ జమీందారు బంగ్లా వద్ద నిర్వహించే శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించి ఆహ్వానపత్రికలను ఆదివారం కుప్పం డిఎస్పీ పార్థసారథి, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వాహకులు వారిని ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 4వతేది కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభిస్తా మన్నారు. 10వతేది ఊరు ఎరిగింపు కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తా యన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఇందూజ్ఞాన వేదిక అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు ప్రకాష్, కృష్ణారెడ్డి, శరవణ, చందు, దేవరాజు, లోకేష్, చరణ్, భరత్, ఇందిర, వాణి, బిందు, వెంకటలక్ష్మి, రాధ పాల్గొన్నారు.



## కార్యకర్త అంత్యక్రియలకు ఆర్థికసాయం

**కుప్పం, ఆగస్టు23 ప్రభాతవార్త :**
మున్సిపల్ పరిధి కొత్తపేట 14వార్డులో ఉన్న తెదేపా కార్యకర్త చిన్నరాజ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా నేతలు నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ అప్పు (ముఖేష్), యువ




నేత రాహుల్‌కుమార్, పార్టీ అధ్యక్షుడు సుకుమార్, మాజీ బూత్ ఇన్‌చార్జ్ మునస్వామి పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణీకుడికి అప్పగింత

**కుప్పం, ఆగస్టు 23ప్రభాతవార్త :**
కుప్పం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో ఓ ప్రయాణీకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి ఆ ప్రయాణీకుడికి ఆదివారం డిపో మేనేజర్ రవి అందజేశారు. ప్రయాణీకుడు బస్సుల్లో పోగొట్టుకున్న

24 CTR 5:24 CTR 5.qxd 8/23/2026 10:22 PM Page 1



# తొట్టంబేడు రెవెన్యూ అధికారుల తీరే వేరయా!



**తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త:**
మండల రెవెన్యూ అధికారుల తీరే వేరయా అన్నట్లు మారింది. ఇక్కడ చెయ్యి తడిపితే తప్ప పనులు జరగటం లేదనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి. కాగితం కావాలంటే కరెన్సి అందించాల్సిందే. లేదంటే కళ్ళముందే అక్రమణలు జరుగుతున్నా పట్టించుకునే దిక్కులేదు. ఈ నేపథ్యంలో ఓ రైతు తన భూ రికార్డుల కోసం ఒకటి రెండు కాదు 20 సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు బాధిత రైతు వాపోయారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయంలో మొరబెట్టుకున్నా ఎవరు చెబితే మాకేంటి అన్నట్లు రెవెన్యూ అధికారుల తీరు మారింది. రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి కోరినన్ని రికార్డులు అందించినా మాకు ఇవ్వలేదని తిప్పుకుంటున్నారు. మరి ఆ రైతు జీవితాంతం తానుకోరిన రికార్డులను అందిస్తారో లేదో అని కంట తడిపెట్టుకుంటున్నారు. తొట్టంబేడు మండలం పిల్లమేడు గ్రామానికి చెందిన రైతు నల్లబోతుల శ్రీనివాసులు భూ రికార్డుల్లో జరిగిన తప్పిదం కారణంగా గత 20 ఏళ్లుగా న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు ప్రభాతవార్తకు వివరించారు. తనకు రెవెనఊ్యా రికార్డులు 33వ దాఖలాలో

## -20 ఏళ్లుగా రెవెన్యూ కార్లాయం ప్రదక్షిణలు

124వ నెంబరు గల పట్టాదారు పాస్ పుస్తకం ఉందని, సర్వే నెంబర్ 679/2లో 2ఎకరాల భూమి తన స్వాధీనంలో ఉందని రైతు తెలిపారు. అయితే రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి 4 ఎకరాలుగా నమోదు కావడంతో పాటు, తాను ఎవరికీ అమ్మకపోయినా వేరే వ్యక్తుల పేరిట మ్యుటేషన్ అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకొని రికార్డులు తారు మారు చేసారని ఆరోపించారు. దీని ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఈ పొరపాటు వల్ల 1బీ, 101 అడంగల్, మీసేవ రికార్డుల్లో తన పేరుకు బదులు ఎన్. బాలకృష్ణారెడ్డి, ఎన్. వాసుదేవరెడ్డి, కూలి సుబ్బరాయుడు అనే వారి పేర్లు వచ్చి చేరాయని, దీంతో తన భూమిపై హక్కులకు భంగం కలుగుతోందని వాపోయారు. ఈ విషయంపై తాను శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ కోర్టును ఆశ్రయించగా, తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పు వచ్చినా, ఎంఆర్ఓ మెమో ఇచ్చినా ఆన్‌లైన్‌లోని తప్పుల తడక జాబితాలో ఇప్పటికీ తన పేరు నమోదు కావడం లేదని, 1బీ, 101 అడంగళ్లలో పాత తప్పులే కొనసాగుతున్నాయని ఆరోపించారు. తన భూమికి సంబంధించిన రికార్డులను సరిచేసి న్యాయం చేయాలని రైతు అధికారులను వేడుకుంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు తొట్టంబేడు తహసిల్దార్ భారతికి విన్నవించిన అదేవిధంగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన తనకు న్యాయం జరగలేదని ఇప్పటికైనా ఎమ్మెల్యే,మండల అధ్యక్షులు దృష్టి సారించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# తిరుపతి డివిజన్

## విశ్వ సౌభ్రాతృత్వ రక్తదాన మహా శిబిరం



**తిరుపతి హెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
బ్రహ్మకుమారీస్ మాజీ చీఫ్, పూజ్య శ్రీ ప్రకాశమణి దాదీజీ 19వ స్మృతి దినాన్ని పురస్కరించుకొని, ఆమె చూపిన సేవాభావానికి నివాళిగా ఈ రక్తదానాన్ని హరే కృష్ణ రోడ్డు, మానస సరోవర్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు బ్రహ్మకుమారీస్ సేవ విభాగం వారు చెప్పారు. దాదీజీ జీవితమంతా త్యాగం, ప్రేమ, సేవ అనే మూడు విలువల చుట్టూ అల్లుకున్నది. ఆమె చూపిన బాటలోనే, బ్రహ్మకుమారీస్ సంస్థ భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఈ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉన్నామన్నారు. రాజయోగం ఆత్మను శక్తివంతం చేస్తే, రక్తదానం ప్రాణాలను కాపాడటానికి తోడ్పడుతుందని, ఒకటి మనలోని శాంతి,శక్తిని పెంపొందిస్తే,మరొకటి అవసరంలో ఉన్న ఒక వ్యక్తికి, ఒక కుటుంబానికి జీవించే ఆశను అందిస్తుందని, ఈ రెండు సేవలూ వేర్వేరు కావు రెండూ ఇచ్చే మనసు నుండే పుడతాయని అన్నారు. కార్యకర్తలు, రాజయోగ అభ్యాసీలు, సేవాభావం కలిగిన ఎందరో సోదర, సోదరీమణులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారని, తమ పరిచయస్తులు, బంధువులను కూడా ప్రోత్సహించి రక్తదానం చేయిస్తున్నారని అన్నారు. రక్తదానం చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



**తిరుపతి,ఆగస్టు 23ప్రభాతవార్త:**
విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. వినియోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

## శ్రీకాళహస్తికి ట్రాఫిక్ స్టేషన్ మంజూరు చేయండి: కొట్టె



**శ్రీకాళహస్తి,అగస్టు 23 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తీశ్వరాలయం టౌన్‌గా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో రోజు రోజుకు ట్రాపిక్ సమస్య పెరుగుతుందని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌తో పాటు సిబ్బందిని నియమించాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ హోం మంత్రి అనితను అభ్యర్థించారు తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన హోం మంత్రి అనితను కలసిన కొట్టెసాయి ప్రసాద్ కలసి దుశ్శాలువతో సత్కరించారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయానికి రోజు రో జుకు భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. ముఖ్యంగా సన్నిధి వీధిలో ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలతో ప్రతి రోజూ సమస్యను ఎదుర్కొంటున్నట్లు వివరించారు.
ఫోటో –ఎస్‌కెహెచ్‌టి 9
రైటప్: హోం మంత్రికి శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

## సూర్యప్రభవాహనంపై నీలకంఠుని దర్శనం



**శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 23 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరు గ్రామంలో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్వామి అమ్మవార్లు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడి ఉత్సవాలను ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్‌లు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో ముస్తాబు చేసారు. ఈ ఏడాది ఉత్సవాలకు నిధులను సమృద్ధిగా సమకూర్చారు. అంతేకాక అలంకారానికి అవసరమైనన్ని పూలను అందించారు. దాంతో అలంకారాలు ఆహో అనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి జనార్ధన్ శర్మపర్యవేక్షణలో ముస్తాబు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం నాలుగుమాడావీధుల్లో సాగింది. భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

## ఎఇఇ పరీక్షలకు...79శాతం హాజరు

**తిరుపతి,ఆగస్టు 23 ప్రభాతవార్త:**



ఎస్పీడిసిఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల నియామకానికి నిర్వహిస్తున్న రాత పరీక్షలు మొదటి రోజు 79శాతంమంది హాజరయ్యారు. తిరుపతిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తనిఖీ చేశారు. మొత్తం 5,757 మందికి గానూ 4,571 మంది హాజరైనట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల్లో భద్రతా చర్యలు, ఆరోగ్య సేవలు, బయోమెట్రిక్ హాజరు, అభ్యర్థుల తనిఖీ తదితర ప్రక్రియలను నిబంధనల మేరకు నిర్వహించామన్నారు.

## ఆలయానికి ఏసీ విరాళం



**తొట్టంబేడు, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తికి సమీపంలోని అర్ధనారీశ్వ రాలయానికి భక్తుడు ఎసిని విరాళంగా అందించారు. ఆదివారం ఆలయాన్ని దర్శించుకున్న దాతలు భక్తి భావంతో దాతృత్వాన్ని చాటుకున్నారు శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కోబాక దంపతులు. తమ కుమారుడి పుట్టినరోజును ఆధ్యాత్మిక సేవతో గుర్తుండిపోయేలా చేసుకున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ ఆలయమైన అర్ధనారీశ్వర స్వామి ఆలయానికి సుమారు రూ.50 వేలు విలువ చేసే ఎయిర్ కండిషనర్ ను కోబాక శాంతి, సుబ్రమణ్యం దంపతులు విరాళంగా అందించారు. తమ కుమారుడు దామన్ తేజ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. ఏసీకి సంబంధించిన బిల్లును ఆదివారం ఆలయ చైర్మన్ కొట్టేసాయి ప్రసాద్,ఈవో బి.కె. వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయాల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఎంతో సంతోషకరమని, కోబాక కుటుంబ సేవలు ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. దాతల కుటుంబానికి ఆలయ పాలకమండలి తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## శివయ్యసేవలో మహారాష్ట్ర మంత్రి పూజలు



**శ్రీకాళహస్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని సన్నిధిలో ఆదివారం మహారాష్ట్రకు చెందిన మంత్రి కుటుంబ సభ్యులతో ప్రత్యేకపూజలు జరిపించుకున్నారు. మంత్రి మేఘనా సకోరే బోర్డికర్ కుటుంబ సభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో ఎఇఓ లోకేష్‌బాబు, పిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వమించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలుజరిపించుకోవాలని కోరగా వెంకటే ఏర్పాటు చేసారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఎఇఓ లోకేష్‌బాబు అందించారు.

## శివయ్య సేవలో ఆర్‌బిఐ అధికారులు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం ఆర్‌బిఐ,యూనియన్‌బ్యాంక్ ఉన్నతాధికారులు పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవి కుమార్‌లు వేదపండితులతో స్వాగతం పలికారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోనాలి సేన్ గుప్తా, జనరరల్‌మేనేజర్ ఆర్.సుదీప్, ఎస్ఐడిడి విభాగం డిజిఎం,హెచ్‌ఓడి అనంతిఎప్. ఎజిఎం దీపాంకర్, యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి రీజినల్ హెడ్ ఎల్ఎస్‌విఆర్ఎస్ శర్మ తదితరులు వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతోప్రత్యేకాశీర్వచనాలు అందించారు. కాగా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చవాన్ ప్రకాష్ కుటుంబసభ్యులతో రాగా వారికి ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు. వారికి ఆలయాధికారులతోపాటు కోర్టు ప్రోటోకాల్ సిబ్బంది ఏర్పాట్లును పర్యవేక్షించారు.

# కృషి విజ్ఞాన కేంద్రాలదే కీలక పాత్ర



**రేణిగుంట, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను చేరువ చేయడంలో కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర కీలకమని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. రాజ్‌బీర్ సింగ్ అన్నారు. తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం కరకంబాడి చైతన్యపురంలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆదివారం సందర్శించిన ఆయన రైతులు, శాస్త్రవేత్తలతో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రైతు బాంధవుడు ఆచార్య ఎన్‌జీరంగా విగ్రహానికి నివాళుల ర్పించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలోని వివిధ ప్రదర్శనా క్షేత్రాలను పరిశీలించి, పంట పొలంలో మొక్కలు నాటారు. రైతుల ఆదాయం పెంపొందించేందుకు గత 35 ఏళ్లుగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వాటి ఫలితాలు ప్రశంసనీయమని డా. రాజ్‌బీర్ సింగ్ పేర్కొన్నారు. కేంద్ర శాస్త్రవేత్తల సూచనల మేరకు ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. యువతను వ్యవసాయ, అనుబంధ రంగాల వైపు ఆకర్షించేందుకు ఐసీఏఆర్ నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను వివరించారు. రాస్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్. వెంకటరత్నం రాస్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఐసీఏఆర్‌అటారీ జోన్10 డైరెక్టర్ డా. షేక్ ఎన్. మీరా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలోని కృషి విజ్ఞాన కేంద్రాల ప్రగతిని, వాటి ప్రాధాన్యతను విసిదీకరించారు. కేవీకే హెడ్ డా. ఎస్. శ్రీనివాసులు కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. వ్యవసాయ, పశువైద్య విశ్వవిద్యాలయాల అధికారులు, శాస్త్రవేత్తలు ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పంటలు, అనుబంధ రంగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేల–నీటి సంరక్షణ, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలకు సలహాలు, సూచనలు అందించారు. చివరగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రచురణలను విడుదల చేసి, రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, జీవ పురుగుమందులు, ఖనిజ లవణ మిశ్రమం, సూక్ష్మపోషకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, కేవీకే సిబ్బంది, సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు.

## నాయనూరు అటవీ ప్రాంతంలో జంట ఏనుగులు

**కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త:**
రామకుప్పం మండలం నుంచి కుప్పం మండలంలో ప్రవేశించిన జంట ఏనుగులు ఆదివారం రాత్రికి నాయనూరు అటవీ ప్రాంతంలో తిష్ట వేశాయి. ఈ జంట ఏనుగులు గత మూడు రోజులుగా నూలుకుంట అటవీ ప్రాంతం, దాసేగానూరు పంచాయతీ రామ్‌నగర్, కంగుంది అటవీ ప్రాంతాల్లో సంచరించాయి. రామకుప్పం వైపు ఏనుగులు మరలా వెళ్తాయని అటవీ అధికారులు భావించగా అవి మరలా దారి మార్చి వెనక్కు వచ్చి నాయనూరు అటవీ ప్రాంతంలో చేరాయి.

24CTR 6:24CTR 6.qxd 8/23/2026 10:26 PM Page 1



# నేడు జిల్లా కలెక్టరేట్‌లో...



## ప్రజా సమస్యల పరిష్కార వేదిక -జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి -జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 23 ప్రభాతవార్త:
జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబం ధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## పేద కళాకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు 23 ప్రభాతవార్త:



గ్రామీణ పేద జానపద కళాకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు ఏ. చారులత డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆదివారం కళాకారులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆగస్టు 25న తిరుపతి కలెక్టరేట్ వద్ద జరిగే ఆటపాట మాట కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద కళాకారులకు సొంత స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం హామీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలాట, భజన గురువులు ఎల్లయ్యదాసు, గురవయ్య, అలాగే కల్పన, శోభ, మంజుల, గురవమ్మ తదితర మహిళా కళాకారులు పాల్గొన్నారు.

## తెలుగు గంగ కాలువలో వ్యక్తి గల్లంతు

తొట్టంబేడు, ఆగస్టు 23 ప్రభాతవార్త:
తొట్టంబేడు మండలం సింగమాల గ్రామ సమీపంలోని తెలుగు గంగ కాలువలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతైనట్లు సమాచారం. కాలువలో నీటి ప్రవాహం, లోతు ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తొట్టంబేడు ఎస్సై బి బాలకృష్ణ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. కాలువ పరిసర ప్రాంతాల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గల్లంతైన వ్యక్తి వివరాలు, కాలువలో పడిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని బాలకృష్ణ తెలిపారు. అయితే అక్కడ ఉన్న స్థానిక సమాచారం మేరకు గల్లంతైన వ్యక్తి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్గా పని చేస్తున్నట్లు సమాచారం. ఇతను పొయ్య గ్రామానికి కనెక్షన్ కోసం వెళ్తుండగా మార్గం మధ్యలో ఇతనితో పాటు మరొకరు కాలువ పక్కన కూర్చొని ఉన్నట్లు గమనించామని స్థానికులు చెబుతున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కరుమారియమ్మ ఉత్సవాలు,ఊరేగింపు



శ్రీకాళహస్తి ఆగష్టు 23 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన కరిమారియమ్మ ఆలయంలో జరుగుతున్న మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కన్నుల పండువగా గెరిగే ఉత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా భక్తులు గెరిగెతో పాటు మాల దరించి ఊరేగింపుజరిపారు. స్వర్ణముఖి నదిలో స్నానమాచరించి మాల ధరించి ముస్తాబు అయి ఊరేగింపు జరిపారు. భక్తి శ్రద్దలతో అగ్నిగుండ ప్రవేశం జరిపారు. సుమారు 20 సంవత్సరాలుగా ఇక్కడ భక్తి శ్రద్దలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి ఆలయం వద్ద మహిళలు భారీ సంఖ్యలో పొంగళ్ళు పెట్టారు.

## ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

– జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు



తిరుపతి కలెక్టరేట్. ఆగస్ట్ 23 ప్రభాతవార్త :
కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, అధికారులు, సిబ్బంది ఆంధ్ర కేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు గారు దేశ స్వాతంత్ర్యోద్యమంలో పోషించిన పాత్ర, ప్రజాసేవకు చేసిన కృషి, నిర్భయమైన నాయకత్వాన్ని స్మరించుకున్నారు. ఆంధ్ర కేసరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కృషి చేయడమే మహనీయుల ఆశయాలకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, సెట్విన్ సీఈవో, సిపిఓ ,జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్‌ని సన్మానించిన ప్రముఖులు



సత్యవేడు, ఆగస్టు 23 ప్రభాతవార్త:
నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ హాలులో సూళ్లూరుపేట ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ బంధువు తానంకి నానాజీ కుమారుడు కౌశిక్ నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం హాజరై కౌశిక్ దంపతులను ఆశీర్వదించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్యవేడు టీడీపీ నాయకులు రామాంజుల నాయుడు, జయరాంరెడ్డి, యాచేంద్ర నాయుడు, ఇళంగోవన్‌రెడ్డి, రవిరెడ్డి, లోకారెడ్డి,కరుణాకర్ నాయుడు, దశరథన్, నాగరాజు, పృథ్వి, అవసరం సురేష్, నాగార్జునరెడ్డి, మురళి, ఈశ్వర్, సుధాకర్ నాయుడు, నరేంద్ర తదితరులు పాల్గొని కౌశిక్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖులతో రాకతో నిశ్చితార్థ వేడుక సందడిగా సాగింది.

# పుత్తూరు శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు దృశ్యాలు







## అయ్యలనాడు చెరువు...ఆక్రమణ దారులకు వరం



### -చెరువు మధ్యలో జెండాలు నాటిన కబ్జాదారులు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితి తీవ్రస్థాయికి చేరుకుంది. గత 50సంవత్సరాలుగా ఎప్పుడూ ఎండని అయ్యలనాడు చెరువు ఈ ఏడాది పూర్తిగా చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. దాంతో ఆక్రమణ దారులకు వరంగా మారింది. శనివారం రాత్రికి రాత్రి కజ్జాదారులు రక రకాల జెండాలను నాటారు. అయితే రెవెన్యూశాఖ కళ్ళు మూసుకుంది. చెరువు లోతట్టు పూర్తిగా ఎన్నడూ లేని విధంగా ఎండిపోయింది. దాంతోచుట్టుపక్కల బోర్లలో భూగర్భ జలాలు అడుగింటిపోయాయి. ఈ ప్రాంతంలో ఇళ్ళలో బోర్లు చేతులెత్తేసాయి. మున్సిపాలిటి నీటిని మీద ఆధారపడాల్సి వస్తుంది. అయితే మున్సిపాలిటి ఉద్యోగి గతంలో ఒక గంట సరఫరాచేసే నీటిని కేవలం 45 నిముషాలు మాత్రమే సరఫరా చేస్తుండటంతో ప్రజలు మంచినీటి కోసం తిప్పలు పడుతున్నారు. అయ్యలనాడుచెరువు ఎండిపోవటం కరువుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

**చెరువు గురించి పట్టించుకోని రెవెన్యూ అధికారులు:**

శ్రీకాళహస్తి నడిబొడ్డులో ఉన్న అయ్యలనాడు చెరువును కాపాడాలనే దిశగా రెవెన్యూ అధికారులు యోచించటం లేదు. ప్రభుత్వమేమో జలవనరులను సంరక్షిద్దాం అంటుంటే రెవెన్యూశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ కబ్జాదారులకు ఎర్రతివాచిలు పరుస్తున్నారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న చెరువును ఆధునీకరించాలని చక్కటి పార్కుతో పాటు పిల్లల పార్కు, బోటు క్లబ్ ఏర్పాటుకు నాటి నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చొరవ చూపారు. తుడా వారి సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు వివిధ పార్టీలకు పోను మిగిలిన స్థలానికి ఫెన్సింగ్ వేయించారు. నాడు అమృతపథకంలో గోపాలకృష్ణారెడ్డి రూ.75లక్షలు మంజూరు చేయిస్తే అప్పటిలో ఉన్న కమిషనర్ ఈ నిధులు చెరువులోని నీటిని బెయిల్ అవుట్ చేయటానికి సరిపోదని ఆ నిధులు మురిగిపోతాయని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పచ్చదనాన్ని పరిచారు. తరువాత పట్టించుకోలేదు. దాంతో ఆక్రమణలు పెరిగాయి. ప్రస్తుతం దశల వారిగా ఆక్రమణలకు గురౌతున్నా పట్టించుకోవటం లేదు. శనివారం రాత్రికి రాత్రి చెరువు లోతట్లు కబ్జాదారులు జెండాలు నాటుకున్నారు. శాసనసభ్యుడు గుర్తించి చెరువు లోతట్టు నాటి తండ్రి కలను సాకారం చేయటానికి పిల్లల పార్కు,బోటు క్లబ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## రెండు ఆటోలు డీ నలుగురికి గాయాలు

పాకాల, ఆగస్టు 23, ప్రభాతవార్త



పాకాల మండలంలోని ఇరంగారి పల్లి సమీపంలో రోడ్డులో ఆదివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురేదుగా వస్తున్న రెండు ఆటోలు ఒకదానిని ఒకటి వేగంగా డీకొన్న సంఘటనలో గాదంకి గ్రామానికి చెందిన పలువురు గాయపడ్డారు. ఇందులో నలుగురు పిల్లలు గాయపడగా వెంటనే కొత్తకోట, తిరుపతికి తరలించారు. పాకాల 108 వాహనం అందుబాటులో లేనందున ప్రైవేట్ వాహనంలో తరలించాల్సి వచ్చింది. సంఘటన ప్రాంతానికి మూడు కిలోమీటర్లలో పోలీస్ స్టేషన్ ఉన్న ఘటన జరిగిన అరగంటకు కూడా పోలీసులు చేరుకొకపోవడం కోసమేరుపు.

## అక్రమ అక్రమ మద్యం విక్రేతాలు ఇద్దరు అరెస్ట్

– 20 మద్యం బాటల్లో స్వాధీనం



తిరుపతి క్రైమ్, ఆగస్టు 23, ప్రభాతవార్త
అక్రమంగా మద్యం బాటిల్లను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అలిపిరి పోలీసులు శ్రీ శనివారం రాత్రి అరెస్టు చేశారు. అలిపిరి ఎస్సై సమాచారం మేరకు టిడిపి విజిలెన్స్ సిబ్బంది, అలిపిరి పోలీసులు సంయుక్తంగా చేసిన తనిఖీలలో అక్రమంగా మద్యం బాటళ్లు విక్రయిస్తున్న రాము, ప్రియాలను అరెస్టు చేశారు. వారి నుండి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వాటిని సీజ్ చేశారు. అనంతరం నిందితులపై సంబంధిత కేసును నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిందితులు ఈరోజు తెలంగాణ ప్రాంతం వారని అక్కడనుండి తిరుచానూరులో నివాసం ఉంటూ అక్రమంగా మద్యం బాటిల్ విక్రయిస్తున్నారని తెలిపారు. మీరు వెనక ప్రధాన సూత్రధారులను త్వరలోనే అరెస్టు చేస్తామని వివరించారు.

## గంజాయి విక్రేతలు ఇరువురు అరెస్ట్

– 6350 గ్రాముల గంజాయి స్వాధీనం




తిరుపతి క్రైమ్, ఆగస్టు 23 ప్రభాతవార్త:
తిరుపతి ఎస్పి సుబ్బారాయుడు, లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవి మనోహర్ ఆచారికి అందిన పక్క సమాచారంతో ఇద్దరు గంజాయి విక్రెతలను తిరుపతి రూరల్ సిఐ మద్దయ్య ఆచారి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ పాత్రికేయులకు ప్రకటన ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో పక్క సమాచారం ద్వారా గంజాయి వ్యక్రేతలను ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందులో ధనలక్ష్మి నగర్‌కు చెందిన విక్రమ్ రెడ్డి కాగా మరో వ్యక్తి తిరుచానూరుకు చెందిన మురుగన్‌గా గుర్తించారు. వీరి వద్ద నుండి 6 కేజీల 350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు అరకు నుండి గంజాయి దిగుమతి చేసుకొని 50 గ్రాములు ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. అరెస్టు చేసిన నిందితులను సంబంధిత సెక్షన్లో కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిందితులకు గంజాయిని అందించిన సూత్రధారులపై దర్యాప్తు చేపడుతున్నామని త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని తహసిల్దార్ వద్ద ప్రవేశపెట్టి అనంతరం రిమాండుకు తరలించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ సమర శంఖం




## - పెన్షన్ ఉద్యోగి హక్కు ప్రభుత్వ దయ కాదు

తిరుపతి హెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:
ప్రస్తుత ప్రభుత్వం ఎలక్షన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చీర్ల కిరణ్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగుల్లో చైతన్యం తీసుకురావడం ఉద్యోగుల భవిష్యత్తు భద్రత కోసం ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా సెప్టెంబర్ 1 2026న గుంటూరులో సమర శంఖం విక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సమర శంఖం పోస్టర్లను ఆవిష్కరించారు. దేశంలోని రాజస్థాన్, చత్తీస్గడ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌పిఎస్ నుంచి ఓపిఎస్‌కు మారినప్పుడు ఆంధ్రప్రదేశ్ ఎందుకు వెనకడుగు వేస్తున్నది ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్, ఎలక్షన్ల ప్రచారంలో భాగంగా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధాన్ని పునరుద్ధరిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యోగి పదవి విరమణ తర్వాత భద్రమైన పెన్షన్ కోరుకోవడం తప్పా అని ప్రశ్నించారు. పెన్షన్ అనేది ప్రభుత్వ దయతో ఇచ్చే బహుమతి కాదని, ఉద్యోగి దీర్ఘకాలిక సేవ ద్వారా సంపాదించే ప్రయోజనమని సుప్రీంకోర్టు అమలు తీర్పుల్లో స్పష్టం చేసిందని అన్నారు. సెప్టెంబర్ 1న గుంటూరులో నిర్వహించనున్న సమర శంఖం కార్యక్రమానికి తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉపాధ్యాయులు సిపిఎస్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ చేపట్టుతున్నట్లు తెలిపారు. సిపిఎస్ రద్దు పాత పెన్షన్ అమలు, పిఆర్‌సి, ఐఆర్, టిఏలు, ఉద్యోగుల సమస్యల పైన, సమర శంఖంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకీపురం పవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీమోహన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటూరు రేఖ, కార్యవర్గ సభ్యులు నక్క రామచంద్ర, జయచంద్ర, ఈశ్వర్ నాయక్, గంటా భరత్, తదితరులు పాల్గొన్నారు.